సంసారంలో సరిగమలు!

వసుంధర

"ఏమిటండీ అలా ఉన్నారు?" అంది శాంతాదేవి.

గోవిందరావు బదులివ్వకుండా భార్యకు ఓ కాగితం అందించాడు.

"డియర్ గోవిందరావ్—ఎంతో సంతోషంగా ఉన్నావు కదూ—నువ్వు జీవితాంతం అవమానపడే సంఘటన అతికొద్దిరోజుల్లోనే జరుగనున్నది. సిద్ధపడు!"

శాంతాదేవి ఆ కాగితం చదివి-"ఏమిటండీ ఇది? ఎవరు వ్రాశారు?" అనడిగింది.

"పోస్టులోవచ్చింది. ఈ హెచ్చరిక ఎవరు ఎందుకు పంపారో నాకు తెలియడంలేదు. నా మనసు కీడును శంకిస్తోంది—" అన్నాడు గోవిందరావు.

గోవిందరావు ఆ ఊళ్లో అప్పుడప్పుడే గుర్తింపు తెచ్చుకుంటున్న పెద్దమనిషి. అతడికి ఊళ్ళో ఓ పుస్తకాలషాపు, కాళ్ళఫారం ఉన్నాయి. స్వగ్రామంలో పదెకరాల భూమీ, ఓ చిన్న డైరీఫారం ఉన్నాయి. భార్యాభర్త

లిద్దరి పేరునా డిపాజిట్లు మూడు లక్షలకు దాటాయి. ఇంకా కొత్త వ్యాపారాల్లో అడుగు పెట్టాలని ఆయన అనుకుంటున్నాడు.

గోవిందరావుకు పెళ్ళై ఆరేళ్ళు దాటింది. ఇద్దరమ్మాయిలు. రెండోసారి కాన్పు కష్టమైతే భార్యకు ఆపరేషన్ చేసేశారు. అందువల్ల మరిపిల్లలు పుట్టే అవకాశం లేదు. తన పిల్లలంటే గోవిందరావుకు ప్రాణం. అతగాడి వయస్సు ముప్పై దాటింది. శాంతాదేవి వయసు పాతిక్కి మించలేదు. పెద్దకూతురు నాలుగేళ్ళది. రెండో కూతురు రెండేళ్ళది.

వాళ్ళింట్లో సామాన్యుడు కలగనే వస్తువులన్నీ ఉన్నాయి.

నిజానికి మహారాజులకంటే, అష్టయిశ్వర్యవంతులకంటె గోవిందరావువంటివాళ్ళే అదృష్టవంతులు. అతడు భాగ్యవంతుల్లో సామాన్యుడు. అందువల్ల సామాన్యుల్లో భాగ్యవంతుడిగా బ్రతకగల్గుతున్నాడు. అతడి చుట్టుప్రక్కల ఉన్నవారందరికీ అతడొక మహాదృష్టవంతుడిలా కనబడతాడు. చాలామంది అతడి ఇంటికి వచ్చివెళ్ళే అవకాశముంది. ఆ విధంగా అతడి సంపదలను సామాన్యులు చూసే అవకాశముంది. మరీ గొప్పవాళ్ళ ఇంటికి సామాన్యులు వెళ్ళిచూసే అవకాశముండదు కదా?

ఆ అదృష్టవంతుడు గోవిందరావు కిప్పుడిలాంటి ఉత్తరం వచ్చింది.

"ఏ దరిద్రపు వెధవకి కన్నుకుట్టిందో ఏమో——" అంది శాంతాదేవి బాధగా.

"రాసిందెవరో తెలిస్తే ఏ బాధాలేదు. కానీ ఎలా తెలుసుకునేది?" అన్నాడు గోవిందరావు.

"ఎవరైనా డిటెక్టివ్‌ను కలుసుకుంటే?" అంది శాంతాదేవి.

"డిటెక్టివ్ దగ్గరకు వెళ్ళామనుకో—ఆయన చాలా ప్రశ్నలడుగుతాడు. మనతో విరోధం ఉండే అవకాశం ఎవరెవరికుందో చెప్పమంటాడు. ఆ విషయం తెలిస్తే మనమే అన్నీ ఊహించుకోవచ్చు. ఆ డిటెక్టివ్ కాస్త చేతకాని వాడయ్యాడంటే—అనవసరంగా ఏ కావలసిన వాడి దగ్గరో మాటజారి అయినవాళ్ళతో చెడిపోయేలాకూడా చేయొచ్చు—" అన్నాడు గోవిందరావు.

"అయితే ఏం చేస్తారు?"

"ప్రస్తుతానికి ఎవరో సరదాకి రాశారని సరిపెట్టుకుందాం. అంతకంటే ఏం చేయగలం?" అన్నాడు గోవిందరావు నిట్టూర్చుతూ.

2

"రేపే ఉమ పుట్టిన రోజండీ—" అంది శాంతాదేవి. ఉమ గోవిందరావు పెద్దకూతురు. రెండోదాని పేరు రమ.

"అవును. అందుకు ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయికదా!" అన్నాడు గోవిందరావు.

"దానికి నాలుగునిండి అయిదోస్తున్నాయి. అందుకని ఈసారి ఎక్కువమందిని పిలుద్దామని అనుకొంటున్నాను" అంది శాంతాదేవి.

"శాంతా—నువ్వు కావడానికి నా అర్ధాంగివే కాని నీకు నాపై సంపూర్ణాధికారాలున్నాయి. నువ్వేమంటే కాదన్నాను....?" అన్నాడు గోవిందరావు.

"మీరు భర్తగా లభించడం నా అదృష్టం. మన ఈ అదృష్టం కలకాలం ఇలాగే ఉండాలన్నది నా కోరిక"

అంది శాంతాదేవి భర్త జుట్టులోనికి వేళ్ళు పోనిస్తూ.

"పిల్లలు నిద్రపోయారా?" అన్నాడు గోవిందరావు.

"ఇంకా ఇంత సేపా? ఎనిమిదిదాటేక ఒక్క క్షణం కూడా మెలకువగా ఉండలేరు వాళ్ళు...."

గోవిందరావు వాచ్ చూసుకుని ఆవలించి—

"తొమ్మిదిన్నరయింది—" అన్నాడు.

"ఏం మీకూ నిద్రవస్తోందా?" అంది శాంతాదేవి నవ్వుతూ.

"నిద్రరావడంలేదు కానీ పడుకోవాలని ఉంది—" అన్నాడు గోవిందరావు.

శాంతాదేవి బుగ్గలు ఎర్రబడ్డాయి— "మీకు ఇంకా చిన్నతనం పోలేదు—" అంది.

"నీకు ముసలాడిలా కనబడుతున్నానేమోకానీ నేనింకా చిన్నవాణ్ణేమరి!" అన్నాడు గోవిందరావు నవ్వుతూ. ఆ మాటలకు శాంతాదేవి బుగ్గలఎరుపు ఇంకా ఎక్కువైంది.

అంతలో ఎవరో తలుపు తట్టిన చప్పుడైంది.

"ఎవరో తలుపు తడుతున్నారండీ!" అంది శాంతాదేవి.

"ఈ సమయంలో నిన్ను వదిలి వెళ్ళి తలుపు తీయలేను...." అన్నాడు గోవిందరావు.

"పోనీ నేను వెళ్ళి తలుపు తీస్తాను...." అంది శాంతాదేవి.

"అప్పుడు మాత్రం నిన్ను వదిలి ఉండగలనా? అయినా బుద్ధిలేనివెధవలు ఇంతరాత్రివేళ యువక దంపతుల ఇంటితలుపు తడతారా?" అన్నాడు గోవిందరావు చిరాగ్గా.

తలుపు మళ్ళీ చప్పుడయింది.

"మోటు వెధవల్లా ఉన్నారు. వాళ్ళకి కాలింగ్ బెల్ కూడా కనబడుతున్నట్లులేదు" అని విసుక్కుంటూ లేచి వెళ్ళాడు గోవిందరావు. అతడు తలుపు తీసేసరికి ఇద్దరు యువకులు కనబడ్డారు. అతననుకున్నంత మోటుగాలేరు వాళ్ళు.

"గోవిందరావున్నాడా?" అన్నాడు వాళ్ళలో ఒకడు.

ఆ పలకరింపుకు చిరాకుపడుతూ "నేనే గోవింద రావును" అన్నాడతను.

వెంటనే యువకులిద్దరూ చటుక్కున లోపలకు అడుగుపెట్టారు. ఒకడు వెంటనే తలుపువేసి— "ఈ రాత్రికిక్కడే పడుకుంటాం—" అన్నాడు.

"ఎవరుమీరు?" అన్నాడు గోవింతరావు కంగారుగా.

"మా ఉత్తరం అందలేదా?" అన్నాడో యువకుడు విసుగా.

"ఏ ఉత్తరం?"

"డబ్బుతో వంటికి బాగా కొవ్వెక్కింది కమా? చిన్న చిన్న ఉత్తరాలు నీ మీదేం పని చేస్తాయిలే?" అని ఆ యువకుడు నవ్వి — "నువ్వు చాలా సంతోషంగా ఉంటున్నావు. జీవితాంతం కుమిలికుమిలి బాధపడేస్థితికి నిన్ను దిగజార్చడం మా ఆశయం"—అన్నాడు.

"ఆ ఉత్తరం రాసింది మీరా? ఎవరుమీరు? నేను మీకేం అపకారం చేశాను? నాకేమీ అర్ధంకావడంలేదు" అన్నాడు గోవిందరావు.

"ప్రస్తుతానికి నీకు మా పేర్లు అనవసరం. సులభంగా ఉంటుంది కాబట్టి నన్ను నెంబర్ వన్ అనీ, ఈ నా మిత్రుణ్ణి నెంబర్ టూ అనీ వ్యవహరించు—" అన్నా

డొక యువకుడు.

గోవిందరావు చటుక్కున రెండడుగులు వెనక్కివేసి వేగంగా అక్కణ్ణించి పక్కగదిలోకి వెళ్ళబోయాడు. నెంబర్ వన్ ఒక్కఉదుటున వెళ్ళి గోవిందరావును చేయి పట్టుకుని "పిచ్చిపిచ్చి వేషాలు వేయకు. మా ఇద్దరిదగ్గరా రివాల్వర్లున్నాయి. ఈ క్షణంనుంచి మీ ఇంట్లో ఎవరో ఒకరు మా నెంబర్ టూ కంట్రోల్లో ఉంటారు. నేను ఇల్లంతా తిరుగుతూంటాను" అంటూ రివాల్వర్ తీసి అతడికి గురిపెట్టాడు.

అదేసమయానికి అక్కడికి వచ్చిన శాంతాదేవి ఆ దృశ్యంచూసి కెవ్వుమని అరిచింది.

"నీ భార్యను అరవొద్దని చెప్పు!"అన్నాడు నెంబర్ వన్.

"అరవకే బాబూ!" అన్నాడు గోవిందరావు.

"గుడ్! ఇప్పుడు మనం అలా సోఫాల్లో కూర్చుని ముందు కార్యక్రమం చర్చిద్దాం. నీ భార్య సమయానికే వచ్చింది. అంతా కలిసే మాట్లాడుకుందాం" అన్నాడు నెంబర్ వన్.

అంతా వెళ్ళి అక్కడున్న సోఫాల్లో కూర్చున్నారు.

వచ్చిన వాళ్ళెవ్వరో గోవిందరావు భార్యకు చెప్పాడు. శాంతాదేవి ఆ ఆగంతకులవంక బెంగగా, భయంగా చూసింది.

"మేమీ ఇంట్లో రేపు రాత్రి పది గంటలవరకూ ఉంటాం!" అన్నాడు నెంబర్ వన్.

"రేపు మన ఉమ పుట్టినరోజండీ!" అంది శాంతాదేవి.

"ఆ విషయం మాకు తెలుసు. అది మాకు ముఖ్యమైన అవకాశం. అందుకే ఈ రోజు రాత్రి ఇక్కడకు వచ్చాం...." అన్నాడు నెంబర్ వన్.

"ఏమిటి మీ పని?" అంది శాంతాదేవి.

"అది చెబితే నీకు ఈ క్షణంనుంచీ నిద్రపట్టదు. సమయం వచ్చినప్పుడే ఆ వివరాలు చెబుతాను. ప్రస్తుతానికి తక్షణ కర్తవ్యం తేలుద్దాం—" అన్నాడు నెంబర్ వన్.

"ఎలాగూ మాకు ఈ క్షణంనుంచీ నిద్రపట్టదు. మీ రెందుకొచ్చారో ఇప్పుడే చెప్పేయండి. మా గుండెలదరిచస్తున్నాం—" అన్నాడు గోవిందరావు.

"మేమిద్దరం మీ ముఖ్య బంధువులం. పుట్టినరోజు అని మమ్మల్ని మీరు ప్రత్యేకంగా ఆహ్వానించారు. అదీ రేపు ఎవరైనా మా గురించి అడిగితే మీరు ఎవరికైనా చెప్పాల్సింది! అదీ రేపటి సంగతి మరి ఈ రోజు సంగతేమిటంటే...." అని నెంబర్ వన్ తన మిత్రుడివంక చూసి కన్నుగీటాడు.

నెంబర్ టూ నవ్వి — "మీ భార్యాభర్తలిద్దరూ వేర్వేరు గదుల్లో పడుకోవాలి. మీరు పిచ్చి-పిచ్చి వేషాలేయకుండా ఇద్దరికీ చెరొకరూ కాపలా ఉంటాం ఈ రాత్రి—" అన్నాడు.

శాంతాదేవి భయంభయంగా భర్తవంక చూసింది. గోవిందరావుక్కూడా ఏమనాలో తోచినట్లులేదు. వయసులో ఉన్న భార్యను ఒంటరిగా మరో యువకుడితో వదిలిపెట్టడానికి ఏ భర్త అంగీకరిస్తాడు?

"మేము పిచ్చి-పిచ్చి వేషాలు వేయమని మాట ఇస్తున్నాము—" అన్నాడు గోవిందరావు.

నెంబర్ వన్ కాసేపు ఆలోచించి—"సరే—అయితే మీరు విడివిడిగా పడుకోవాలి. మీ గదిలో నేను పడుకుంటాను. నా మిత్రుడు బయట పడుకుంటాడు—"

అన్నాడు.

అదే ఓ పెద్ద రిలీఫ్ అన్నట్లుగా శాంతాదేవి నిట్టూర్చింది.

"నెంబర్ టూ—నువ్వు టెలిఫోన్ కనెక్షన్ తీసేసి పడుకో—గదిలో వీళ్ళ సంగతి నేను చూసుకుంటాను. గది బయట నువ్వు చూసుకుందువుగాని—" అన్నాడు నెంబర్ వన్ తన మిత్రుడితో.

3

తెల్లవారుఝామున అయిదు గంటలకు కాలింగ్ బెల్ మ్రోగింది.

శాంతాదేవి చటుక్కున లేచి కూర్చుని—"వంటావిడ కావమ్మ అయుంటుంది—" అంది.

అప్పుడు నెంబర్ వన్ మెలకువగానే ఉన్నాడు—"ఇంకా ఎవరెవరొస్తారింటికి?" అన్నాడు.

ఆమె చెప్పిన ప్రకారం ఒక ఆడ, ఇద్దరు మగ—మొత్తం ముగ్గురు పనివాళ్లు వస్తారు ఇంకో గంటలో.

"సరే—నువ్వెళ్ళి పనులు చూసుకో—కానీ ఒక్క విషయం గుర్తుంచుకో. ఈ రోజల్లా నీ భర్త ఈ గదిలో నాకు బందీగా ఉంటాడు. ఇతరులెవ్వరూ ఈ గదిలోకి రాకూడదు...." అన్నాడు నెంబర్ వన్.

ఆ గదిలో అన్ని సదుపాయాలూ ఉన్నాయి.

శాంతాదేవి తలుపులు తీసుకుని బైటకు వెళ్ళింది. కాస్త దూరంలో ఉండి గదివంకే గమనిస్తున్న నెంబర్ టూని చూసి ఆమె కలవరపడింది. తనే వెళ్ళి తలుపు తీసింది. మామూలుగా అయితే మళ్ళీ వెళ్ళి నిద్రపోయేది. కానీ నెంబర్ వన్ ఉన్న ఆ గదిలోకి మళ్ళీ వెళ్ళడానికి ఆమెకు మనస్కరించలేదు. ఆ యువకులిద్దరూ ఎవరో,

ఏం చేయనున్నాడో ఆలోచనలకు అంతుపట్టక ఆమె దిగాలుగా ఉంది.

నెంబర్ టూ అనుక్షణం ఇల్లంతా కలయతిరుగుతూనే ఉన్నాడు. నెంబర్ వన్, గోవిందరావు ఆ గదిలో దిక్కుబడి ఉన్నారు. అందరికీ కాఫీలు, టిఫిన్లు అందాయి.

నెంబర్ వన్ ఇడ్లీలోకి చట్నీ రుచిని మెచ్చుకుంటూ-"అనుభవిస్తున్నావ్ మజా!" అన్నాడు. "అయినా ఇదెంతసేపులే—రాత్రికి నువ్వు ఏడుస్తూ ఉంటావు...." అన్నాడు మళ్లీ.

"నీ ఉద్దేశ్యమేమిటో చెప్పు!" అన్నాడు గోవింద రావు.

"సమయం రాగానే చెబుతాను—"అన్నాడు నెంబర్ వన్.

కుటుంబ సభ్యులు దిగులుగా ఉన్నప్పటికీ ఇంట్లో హడావుడి ప్రారంభమవుతోంది. ఎనిమిదయ్యేసరికల్లా గోవిందరావు వ్యవహారాలు చూసే మేనేజర్ కిరణ్ వచ్చి గోవిందరావును చూడగోరాడు.

"నీకేం కావాలో నాకు చెప్పు. అన్నీ నేను చూస్తాను—" అంది శాంతాదేవి.

"ఆయనతో ఒక్కసారి మాట్లాడాలి!" అన్నాడు కిరణ్.

"ఆయన ఇంట్లో లేరు—" అన్నాడు నెంబర్ టూ. శాంతాదేవి అప్రయత్నంగా అతడివంక చూసింది. నెంబర్ టూ రమను ఎత్తుకొని ముద్దులాడుతున్నాడు. కానీ అతడి కళ్లలో రమను చంపే క్రౌర్యం ఆమె మాత్రమే చూడగలిగింది.

కిరణ్ శాంతాదేవిని నొక్కించలేదు. ఏర్పాట్లు చేయ

డానికి డబ్బు కావాలతడికి. ఆ విషయం చెప్పగానే అతడు అడిగిన డబ్బిచ్చి పంపించింది శాంతాదేవి.

గోవిందరావు తన బెడ్రూంలోనే భోంచేశాడు. కొత్త బట్టలు వేసుకువచ్చిన కూతురిచేత శాంతాదేవి ఆయనకు ఆ గదిలోనే దణ్ణం పెట్టించింది.

"పుట్టిన రోజు ఉమది. సాయంత్రం మా ఇంటికి ఎందరో ముఖ్యులు వస్తారు. ఆ సమయంలో నేనుకూడా బయట వుండి అందర్నీ పలకరించాలి. అందుకు అభ్యంతరమేమిటి?" అన్నాడు గోవిందరావు.

"మాకే అభ్యంతరమూ లేదు. నువ్వు బయటకు వెడితే గదిలో నీ భార్యను వదిలిపెట్టాలి. ఆడదాన్ని ఒంటరిగా నాతో వదలడానికి భయపడుతున్నావు కాబట్టి నేను నిన్ను ఇక్కడ ఉండమన్నాను—" అన్నాడు నెంబర్ వన్.

"ఉమ మా ఇద్దరి కూతురూనూ—మేమిద్దరం బయట ఉండాలి—"

"అలా కుదరదు...." అన్నాడు నెంబర్ వన్.

"ఎందుకని?" అన్నాడు గోవిందరావు.

"ఎందుకో చెబుతాను. జాగ్రత్తగా వినండి—" అన్నాడు నెంబర్ వన్ శాంతాదేవినీ, గోవిందరావునూ ఇద్దర్నీ ఉద్దేశించి.

భార్యాభర్తలిద్దరూ చెవులు రిక్కించారు.

"సాయంత్రం మీ ఇంట ముఖ్యులందరూ జేరాక—వేడుక మధ్యలో ఒక మనిషి అక్కడకు వస్తాడు. అతడి చేతిలో ఏదేళ్ళ కుర్రాడు ఉంటాడు. ఆ వ్యక్తి చెప్పిన కథను శాంతాదేవి నిజంగా అంగీకరించాలి. అంగీకరించని పక్షంలో ఇక్కడ గోవిందరావు చచ్చి

పోతాడు. తర్వాత శాంతాదేవి పిల్లలు కూడా చచ్చి పోతారు. అందుకోసమే మీ దంపతుల్ని వేరువేరుగా ఉంచుతున్నాం—" అన్నాడు నెంబర్ వన్.

"ఏమిటా వ్యక్తి చెప్పే కథ?" అన్నాడు గోవింద రావు,

"ఆ వ్యక్తి పేరు గోపీనాథ్. అతడు శాంతాదేవిని ఒకప్పుడు ప్రేమించాడు. శాంతాదేవి కూడా అతణ్ని ప్రేమించింది. మనసు, తనువు కూడా గోపీనాథ్‌కు అర్పించింది—" అన్నాడు నెంబర్ వన్.

"ఏమండీ—ఇవేం మాటలు?" అరిచినట్లుగా అంది శాంతాదేవి.

"ఇలా అరిచి కాసేపు నటించినా ఫరవాలేదు. కానీ తర్వాత ఇది నిజమని నలుగురిముందూ ఒప్పుకోవాలి. గోపీనాథ్, శాంతాదేవి పెళ్లి చేసుకుందామనుకున్నారు. ఈ లోగా గోవిందరావు శాంతాదేవిని చూసి పెళ్లాడాలనుకున్నాడు. గోవిందరావు ఆస్తిపాస్తులు చూసి శాంతాదేవి తలిదండ్రులు మోజుపడ్డారు. వారి మాట కాదనలేక శాంతాదేవి కూడా ఈ పెళ్లికి ఒప్పుకుంది. ప్రియురాలి మనసు మారిపోగానే గోపీనాథ్ దెబ్బతిన్నాడు. కానీ అతడు శాంతాదేవి సుఖాన్ని కోరుకున్నవాడు. అందువల్ల ఆమె జీవితంలోంచి నిష్క్రమించదలిచాడు. అయితే అప్పటికే శాంతాదేవి మూడు నెలల గర్భవతి. అబార్షన్ చేయిస్తే ప్రాణప్రమాదమని గోపీనాథ్ శాంతాదేవి తలిదండ్రులు నొక్క కోరిక కోరాడు. రహస్యంగా శాంతాదేవికి పురుడు పోయించి పుట్టిన బిడ్డను తనకు అప్పగించాలి. శాంతాదేవికి గుర్తుగా ఆ బిడ్డను పెంచుకుని చరమ జీవితం గడపాలనుకున్నాడతను...."

"అబద్ధం....అంతా అబద్ధం...." అరిచింది శాంతా దేవి.

"ఈ అబద్ధాన్ని నిజం చేయగల శక్తి నీకుంది. చేయాలి కూడా. గోపినాథ్ తన బిడ్డనింతకాలం పెంచాడు. అతడికి జీవితం అంటే విరక్తి కలిగింది. సన్యాసుల్లో కలిసిపోవాలనుకుంటున్నాను. శాంతాదేవి కెలాగూ ఇంక పిల్లలు పుట్టరు. ఆమెకు మగపిల్లలు లేరు. ఈ బిడ్డను ఆమెకు అప్పగించి వెళ్లిపోవాలని వచ్చాడతను. అతని వేదాంత దృష్టికి ఈ ప్రపంచపు హద్దులు తెలియవు...." అని ఆగాడు నెంబర్ వన్.

శాంతాదేవి ఏడుస్తూ—"నేను చచ్చిపొమ్మన్నా చచ్చి పోతానుకానీ ఈ అబద్ధం నిజమని చెప్పలేను. ఆ అవ మానంతో బ్రతకలేను...." అంది.

"నీ భర్త విశాల హృదయుడు. అతడికి నిజం తెలుసును. మేము మీ ఇద్దరిమధ్యా కలతలు సృష్టించడం లేదు. పచ్చగా ఉన్న మీ ఇద్దర్నీ పదిమందిలో నవ్వుల పాలు చేయడమే మా ఉద్దేశ్యం. మా తాలూకు పిల్లవాడు మీ ఇంటి బాబు కావడం మా ఆశయం. ఆ బాబును మీరు నిజంగానే కన్న కుర్రాడిలా పెంచి పెద్ద చేయాలి. వాడికే చిన్న ప్రమాదం సంభవించినా—మీ పిల్లలక్కూడా ప్రమాదం—" అన్నాడు నెంబర్ వన్.

"ఇది అన్యాయం. ఒక హిందూ స్త్రీని దుశ్శీలవతినని అంగీకరించమనడం దారుణం. తను శీలవతినని అందర్నీ నమ్మించడం కోసం అగ్ని ప్రవేశం చేయడానిక్కూడా సిద్ధపడింది సీత. అలాంటి దేశంలోని స్త్రీని ఇలాంటి పనికి బలవంతపెట్టడం నేనంగీకరించను—" అన్నాడు గోవిందరావు.

"నువ్వు అంగీకరిస్తావని నేను అనుకోవడంలేదు. ఆ విషయం నేను పట్టించుకోదల్చుకొనూ లేదు. మేము చెప్పినట్లు చేయాలంటే— లేని పక్షంలో నువ్వు చావల్సిందే—" అన్నాడు నెంబర్ వన్.

సుమారు గంటసేపు అక్కడ చర్చ జరిగింది. ఆ గంట సేపటిలోనూ నెంబర్ వన్ పట్టుదల ఎంత గట్టిదో ఆ దంపతులిద్దరూ తెలుసుకోగలిగారు తప్ప ఇంకే ప్రయోజనమూ కనబడలేదు. చిట్టచివరకు గోవిందరావు శాంతాదేవిని అందుకు ఒప్పించక తప్పలేదు.

"వీళ్లు చెప్పిందానికి ఒప్పుకోకపోతే - నేను చస్తాను మన పిల్లలు చస్తారు. ఆ తర్వాత నువ్వు చస్తావ్. సమస్యలను తర్వాత ఏదో విధంగా పరిష్కరించుకోవచ్చును. ముందు మన ప్రాణాలు రక్షించుకోక తప్పదు...." అన్నాడు గోవిందరావు.

ఈలోగా శాంతాదేవి ఏదైనా అఘాయిత్యం చేయడానికి వీల్లేదు. నెంబర్ టూ రోజల్లా రమను ఎత్తుకునే ఉంటున్నాడు. తన ప్రాణాలనైనా త్యాగం చేయడానికి సిద్ధపడుతుంది కానీ— ఏ తల్లీ తన బిడ్డ ప్రాణాలు తీయడానికి అంగీకరించదు.

ఎంతో ఉత్సాహాకరమైన ఉమ పుట్టిన రోజు ఆ దంపతుల మనసులనిండా విషాదం నింపింది.

4

గోవిందరావు తలపట్టుకుని కూర్చున్నాడు.

శాంతాదేవి కూర్చుని ఏడుస్తోంది.

అది అర్ధరాత్రి ఒంటిగంట సమయం.

నిద్రపోతున్న ఇద్దరాడపిల్లలకు కాస్త దూరంగా ఒక పదేళ్ళ పిల్లవాడు కూడా నిద్రపోతున్నాడు.

"ఏడవకు శాంతా!" అన్నాడు గోవిందరావు అనునయంగా.

"నేనింక వీధిలోకి వచ్చేదెలాగండీ!" అంది శాంతాదేవి ఇంకా ఏడుస్తూనే.

"శాంతా—మనకు డబ్బుంది. డబ్బు ఎలాంటి మచ్చలనైనా తొలగిస్తుంది. నీకు మరీ అంత అవమానంగా ఉంటే ఈ ఊరొదిలి వెళ్ళిపోదాం" అన్నాడు గోవిందరావు.

"కానీ..కానీ..మన పెళ్ళయి ఆరేళ్ళయింది. ఈ పదేళ్ళ కుర్రాణ్ని నా బిడ్డగా ఎలా చెప్పుకోనండీ? వాడిని చూస్తేనే నాకు అసహ్యం వేస్తోంది. వీడు మన ఇంట్లో తిరుగుతూంటే నాకు ఒళ్ళు కంపరంగా ఉంటుంది. నేను చెయ్యని పాపాన్ని కల్పన అనడానికి వీల్లేకుండా ఎదురుగా ఉన్న వీడిగురించి నలుగురికీ నేనేం సంజాయిషీ ఇచ్చుకోవాలి?" అంది శాంతాదేవి ఏడుపు ఆపకుండానే.

గోవిందరావు భార్యను సమీపించి దగ్గరగా తీసుకుని-"ఏడవకు శాంతా! కష్టమో నష్టమో, అవమానమో, దుఃఖమో ఏదో ఒకటి—ఇద్దరం కలిసే భరిద్దాం—" అన్నాడు.

"నేను బ్రతకలేనండీ—చచ్చిపోతాను—" అంది శాంతాదేవి. సాయంత్రం నలుగురిముందూ ఆ భయంకర విషయం ఆమె అంగీకరించగానే అక్కడ పెద్ద సంచలనం కలిగింది. చాలామంది ఆమెను అసహ్యించుకుని అక్కణ్నించి వెంటనే వెళ్ళిపోయారు. కొంతమంది ఆమె ముఖంమీదే నవ్వుకొన్నారు. కొందరు మగవాళ్లు ఆమెకు వినబడేలా ఆమె గురించి అసభ్యంగా మాట్లాడుకున్నారు.

"భర్త పక్కన లేకుండా పార్టీ బాగానే ఏర్పాటు

చేసింది. ఆడాళ్లను వదిలేసి ఒక్క మగాళ్లనే పిలిస్తే ఇంకా బాగుండేది కదా...."

శాంతాదేవి అప్పుడే ఏడుపు ఆపుకోలేకపోయింది. ఆమె ఏడుపు ఎవరిలోనూ జాలిపుట్టించలేదు.

చాలా త్వరగానే ఆ వేడుక ముగిసింది. ఏడేళ్ళ కుర్రాడినక్కడే వదిలేసి గోపీనాథ్ ఎప్పుడో వెళ్ళి పోయాడు. ఆ పాత్ర నటించిన వ్యక్తి ఎవరోగానీ తన పాత్రపోషణ అత్యద్భుతంగా చేశాడు. అందరికీ అతడి గాధ వినగానే—అతనిపైన జాలీ, ఆమెపైన అసహ్యమూ కలిగాయి. ఆ ఏడేళ్ల కుర్రాడు తల్లి ప్రేమకోసం తపించి పోతున్నాడట. వాడిపై కూడా అక్కడ చేరినవారందరికీ సానుభూతి కలిగింది.

అంతా వెళ్ళిపోయాక ఇంట్లో శాంతాదేవి మాత్రమే మిగిలాక నెంబర్ వన్, టూ లిద్దరూ వెళ్ళిపోయారు. వెళ్ళేముందు ఆ పిల్లవాడి గురించి మరీ మరీ హెచ్చరించారు....

"ఇప్పుడు మనం ఏడుస్తూ కూర్చుంటే ప్రయోజనం లేదు. మనమీద ఎవరు ఎందుకు పగబట్టారో తెలుసుకోవాలి. ఇందుకు మనం ఎన్నో విషయాలు చర్చించాల్సి ఉంది—" అన్నాడు గోవిందరావు.

కాసేపటికి శాంతాదేవి మామూలు మనిషయింది. అప్పుడు గోవిందరావు నెమ్మదిగా—"నేనిలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు. పెళ్ళికిముందు నువ్వెవ్వరినైనా ప్రేమించడంగానీ, నిన్నెవరైనా ప్రేమించడంగానీ జరిగిందా—?" అన్నాడు.

శాంతాదేవి కళ్ళు మళ్ళీ చెమ్మగిల్లాయి—"అదుగో— నేను అనుమానించినంతా అయింది. మీలో అప్పుడే అను

మాన బీజాలు నాటుకున్నాయి—" అంది.

"నిన్ను అనుమానిస్తే నేను మూర్ఖుణ్ణే అవుతాను. నా ప్రశ్నను అర్థం చేసుకోకపోతే నువ్వు మూర్ఖురాలివౌతావు. పెళ్ళికి ముందు ఎవర్నైనా ప్రేమిస్తే అదో పెద్ద తప్పు అనుకునే సంస్కార విహీనుణ్ని కాను నేను...." అన్నాడు గోవిందరావు.

"పిల్లలమీద ఒట్టేసి చెబుతున్నాను. మిమ్మల్ని పెళ్ళి చేసుకునేవరకూ పరాయి మగవాడి ఊహ కూడా నా మనసులో మెదలలేదు—" అంది శాంతాదేవి.

ఆమె మాటలకు చలించిపోయాడు గోవిందరావు— "నన్ను క్షమించు శాంతా! నేను నిన్ను శంకించడం లేదు. నువ్వు పునీతలలో పునీతవు. ఇప్పుడు నాకున్న వ్యథలన్నీ ఈ కుర్రాడి గురించే! వీడెవరో మనకు తెలియదు. ఎవరి తాలూకు వాడో తెలిస్తే దాన్నిబట్టి మన మీద పగబట్టినవాళ్ళ ఆచూకీ తెలుసుకోవచ్చు. కానీ ఎలా? వీడికి ఏమాత్రం ప్రమాదం జరిగినా మన పిల్లలకు ప్రమాదమే!" అన్నాడు.

"ఎవరో తెలివిగా పథకం పన్ని—కానీ ఖర్చులేకుండా ఈ కుర్రాణ్ని ఆస్తిపరుణ్ని చేశారు. చేసినవాళ్ళు చేసినట్టూరుకోకుండా మన జీవితాన్ని నవ్వులపాలు చేశారు...." అంది శాంతాదేవి.

5

బాబు తన పేరు విజయ్ అని చెప్పాడు. ఎన్ని ప్రశ్నలువేసినా వాడు చెప్పే విషయం ఒక్కటే. వాణ్ణి గోపీనాథ్ పెంచాడు. వాడి తల్లి పేరు శాంతాదేవి.

వాడు అప్పుడే శాంతాదేవిని అమ్మా అని పిలవడం ఆరంభించాడు.

వాణ్ని ఇంకేం ప్రశ్నలువేసినా తలనొప్పి అంటాడు.

ఎవరో కానీ ఆ కుర్రాడికి మంచి శిక్షణ ఇచ్చారు.

విజయ్ ప్రవర్తన చాలా చక్కగా ఉంది. వాడు ఆడపిల్లలిద్దర్నీ పెద్దచెల్లి, చిన్నచెల్లి అని పిలుస్తున్నాడు. అభిమానంగా చూస్తున్నాడు. ఉమ, రమ, కూడా వాడికి బాగా మచ్చికయ్యారు.

శాంతాదేవి, గోవిందరావు కూడా ఎన్నో విధాల ఆలోచించారు—ఆ కుర్రాడిచేత నిజం చెప్పించాలని. ఏమడిగినా వాడు చెప్పేవి రెండు మాటలు—"నన్ను గోపీనాథ్ పెంచాడు. మా అమ్మ పేరు శాంతాదేవి!"

ఇంకేమైనా అడిగితే — "తలనొప్పి!" అన్నాడు వాడు.

గోవిందరావుకు చిరాకువచ్చి వాణ్ని పక్క గదిలోకి తీసుకువెళ్ళి నాలుగు తగిలించి—"నిజం చెప్పు వెధవ కానా!" అన్నాడు. విజయ్ ఏడుస్తూ కూర్చున్నాడు తప్పితే నిజం చెప్పలేదు.

శాంతాదేవి మధ్యలో కలగజేసుకుని విజయ్‌ని బైటకు తీసుకువచ్చింది. చిన్న కుర్రాడిని హింసించడం తనకు నచ్చదని చెప్పిందామె. గోవిందరావు ఆమెవంక అదోలా చూశాడు.

ఆ రోజు సాయంత్రం గోవిందరావుకు ఫోన్ వచ్చింది.

"మిస్టర్ గోవిందరావ్! ఇది మొదటి తప్పుగా గుర్తించి వదిలేస్తున్నాను. చిన్న కుర్రాడిమీద చేయి చేసుకుంటావా? నీ పిల్లలకు అంగవైకల్యం రావాలని నీకుందా?" అంది ఓ కంఠం ఫోన్‌లో.

గోవిందరావు అదిరిపడ్డాడు—"మీరు పొరబడ్డారు. నేను విజయ్‌మీద చేయి చేసుకున్నానని ఎవరు చెప్పారు?"

ఆ సమయంలో శాంతాదేవి అక్కడే ఉంది— "ఎవరండీ అది!" అందామె.

"నువ్వే విను...."అంటూ గోవిందరావు ఆమెకు ఫోన్ అందించాడు.

"ఒకరు చెప్పాలా నాకు? నీ ఇంట్లో ఏం జరిగినా నాకు తెలుస్తుంది! ఇంకెప్పుడూ ఆ పసిబాలుడిమీద చేయిచేసుకోకు. నీ పిల్లలకు అంగవైకల్యం వస్తుందని హెచ్చరిస్తున్నాను...."

అవతల క్లిక్‌మనేలోగానే రిసీవర్ శాంతాదేవి చేతిలోంచి జారిపోయింది.

"ఎలా తెలిసిందంటావ్ వాడికి?" అన్నాడు గోవిందరావు.

అయోమయంగా ముఖం పెట్టింది శాంతాదేవి.

"వాడేదో సినిమాల్లో ముఠామనిషనీ వాడికి మనింట్లో ఏ క్షణంలో ఏం జరుగుతున్నా తెలిసే ఆధునిక సౌకర్యాలున్నాయనీ నేననుకోవడంలేదు. అయినా అంత అవసరమూ వాడికుండదు. మనింట్లోనే మనమీద గూఢచారులుగా పనిచేస్తున్నారెవరో?" అన్నాడు గోవిందరావు.

"ఎవరై ఉంటారండీ వాళ్ళు?" అంది కంగారుగా శాంతాదేవి.

"నేను విజయ్‌ని కొట్టినపుడు ఇంట్లో ఎవరున్నారు?" అన్నాడు గోవిందరావు.

"వంటమనిషి ఉంది. పనివాళ్ళిద్దరున్నారు...." అంది శాంతాదేవి.

"ఇంకా...."

"పిల్లలున్నారు...."

"ఇంకా...."

"ఇంకెవరున్నారు—మీరూ.... నేనూ?" అని శాంతా దేవి అప్రయత్నంగా భర్తవంక చూసి—"ఏమండీ! మీరు నన్ను అనుమానిస్తున్నారా?" అంది.

గోవిందరావు వెంటనే ఏమీ మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా—"ఆ ముగ్గుర్నీ ఇలా పిలు—" అన్నాడు.

వంటమనిషినీ, పనివాళ్ళనీ శాంతాదేవి పిల్చుకుని వచ్చింది.

"మీరు మా ఇంట్లో మాటల్ని బైటకు చేరవేస్తున్నట్లు నాకనుమానం వచ్చింది. ఒకే ఒక్క రోజు చూస్తాను' ఇది కొనసాగిందా? మీ ఉద్యోగాలు ఊడతాయి—" అన్నాడు గోవిందరావు తీవ్రంగా.

వాళ్ళు ముగ్గురూ ఆ దంపతుల కాళ్ళమీద పడ్డారు. తమకేమీ తెలియదని మొరపెట్టుకున్నారు. తమ అమాయకత్వాన్ని నిరూపించుకునేందుకు ఏ పరీక్షకైనా సిద్ధమే అన్నారు.

వాళ్ళను చూస్తూంటే అమాయకులేనని గోవింద రావుకి అనిపించింది. అయినా ఏ దొంగ కూడా ఓ పట్టాన చేసిన తప్పు ఒప్పుకోడు గదా!

అందుకని మర్నాడు గోవిందరావు వాళ్ళను పరీక్షించ దల్చాడు. వాళ్ళ ముగ్గుర్నీ ఉదయంనించి సాయంత్రం వరకూ వంటిల్లు ప్రాంతాలు కదలకూడదని శాసించాడు.

భోజనాలయ్యాక విజయ్‌ని మరోమారు బెదిరించాడు. ఆ కుర్రాడేమీ చెప్పకపోయేసరికి నాలుగు తగిలించాడు. మధ్యలో శాంతాదేవి కలగజేసుకోపోతే అతని చేతిలో ఆ కుర్రాడే మైపోయేవాడో ఏమో—

ఏడ్చి-ఏడ్చి అలసిపోయి నిద్రపడ్డాడు విజయ్.

విజయ్ నిద్రకుపడ్డ పదినిముషాలకు ఫోన్ వచ్చింది. అది శాంతాదేవి రిసీవ్ చేసుకుంది.

"మా శక్తిసామర్ధ్యాలు తెలిసుండీ మీరెందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? అనవసరంగా పనివాళ్ళను అనుమానించకండి. మీ ఇంట్లో ఏం జరిగేదీ ఇక్కడ నిమిషాలతో సహా రికార్డవుతోంది. ఈ రోజు నీ భర్త విజయ్‌ని సరిగ్గా పదకొండు గంటల నలభైరెండు నిముషాలకు కొట్టాడు. నువ్వు వారించకపోతే కుర్రాడు ఏమైపోయేవాడో ఏమో!"

శాంతాదేవి మతిపోయినదానిలా అయిపోయింది. అప్పుడే అక్కడికి వచ్చిన గోవిందరావు—"ఎవరది?" అని—తర్వాత భార్య ముఖభావాలు చూసి చటుక్కున ఫోన్ అందుకున్నాడు.

"ఏం—మాట్లాడవు? నీ భర్త సరిగ్గా పదకొండు గంటల నలభైరెండు నిముషాలకు విజయ్‌ని కొట్టినట్లు మాకెలా తెలిసిందనా? ఎలా తెలిసిందని ఆలోచించడం వల్ల ప్రయోజనంలేదు. మాకు తెలిసితీరుతోందని గ్రహించాలి. అందువల్ల ఏం జరుగుతుందో ఊహించాలి. ఇంకోసారిలా జరిగితే ఉమకు కాళ్ళుండవు. రమకు చేతులుండవు. దట్సాల్!"

అవతల ఫోన్ క్లిక్‌మంది.

"ఇంపాసిబుల్!" అన్నాడు గోవిందరావు.

శాంతాదేవి నోట మాటరాకుండా కాసేపు అలాగే నిలబడిపోయింది. తర్వాత భర్తను సమీపించి అతడి చేయిపట్టుకుని—"నాతో రండి!" అంది.

ఇద్దరూ పిల్లలు పడుకున్న గదికి వెళ్ళారు. శాంతాదేవి పిల్లలిద్దర్నీ దగ్గరగా తీసుకుని "వీళ్ళిద్దరికీ ఏమైనా

నేను బ్రతకలేనండీ! ఆ విజయ్‌ని కన్నకొడుకులా పెంచుదామండీ!" అంది.

గోవిందరావు తలపట్టుకుని—"శాంతా! నా బాధ నీకు తెలుసు. పదిమందిలో పరువుగా బ్రతుకుతున్నాం మనం. చూస్తూ చూస్తూ వీడికి ఈ విజయ్‌గాడికి ఇంట్లో సమాన హోదా ఎలా ఇవ్వగలం? అలాచేస్తే నీమీద అభియోగం నిజమేనని లోకం నమ్ముతుంది. ఒక పతితగా సమాజం నిన్ను వేలెత్తి చూపిస్తుంది. ఒక పతితను ఆదరించిన నన్ను సమాజం అభినందించదు. చేతకానివాడని వెక్కిరిస్తుంది. అది నువ్వూ నేనూ కూడా భరించలేము. ఈ కుర్రాడి వెనుక రహస్యం తెలుసుకోకుంటే ఎలా?" అన్నాడు.

"వద్దండీ—మన పిల్లల క్షేమంకోసం నేను ఎంత అవమానాన్నైనా భరించడానికి సిద్ధంగా ఉన్నాను-" అంది శాంతాదేవి.

గోవిందరావు మౌనంగా ఉండిపోయాడు.

శాంతాదేవి—"ఏమండీ—ఆ విజయ్ నింకేమీ అననని, కొట్టనని మాట ఇవ్వండీ—" అంది.

"ఈ మాట నువ్వు అడగ్గలిగావు కానీ—నేను ఇవ్వలేను శాంతా!" అని అక్కణ్నించి వెళ్ళిపోయాడు గోవిందరావు.

భర్త మాటలకు అర్థాన్ని ఆలోచిస్తూ అలాగే ఉండిపోయింది శాంతాదేవి.

6

శాంతాదేవి అనుకున్నంత సుగమంగా లేదు జీవితం. అవమానం రకరకాలుగా ఎదురయిందామెకు.

ఇరుగుపొరుగు ఆవిణ్ని చూడగానే చెవులు కొరు క్కుంటూన్నారు. వీధిలో ఆమెను చూడగానే గౌర వంగా తొలగిపోయే మగవాళ్ళిప్పుడు వెకిలి చూపులు చూస్తున్నారు. ఇంట్లో పనివాళ్లు తప్ప ఎవ్వరూ ఆమెను గౌరవించడంలేదు.

తమ పిల్లల క్షేమం దృష్ట్యా ఆమె విజయ్ మీద ఈగ కూడా వాలనివ్వడంలేదు. అది మరిన్ని అపార్థాలుకు దారితీస్తోంది. ఆమె విజయ్‌మీద చూపే ప్రేమాను రాగాల విషయం పనివాళ్ళద్వారా బైటకు పాకుతోంది. ఆమె శీలవతి కాదన్న విషయంలో బయటివారి కెవ్వరికీ ఇప్పుడు సందేహంలేదు.

గోవిందరావు అక్క వచ్చిందో పర్యాయం. విజయ్ గురించి ఆరాలుతీసింది. ఏ పరిస్థితిలో వాడు తమ ఇంట చేరాడో శాంతాదేవి వదినగారికి చెప్పుకుంది.

"వాడు నీ కొడుకు కాకపోతే నాలుగుతన్ని వీధిలోకి గెంటేయాల. మీ కొచ్చిన బెదిరింపు గురించి పోలీసులకు చెప్పాలి. అంతేకానీ ఆ వెధవ నిలా నెత్తికెక్కించుకుని ఆస్తి కట్టబెడతారా?" అని మరదల్ని మందలించిందామె.

తమ్ముడి దగ్గరకు వెళ్ళి—"దాని ప్రేమాభిమానాల తీరు చూస్తూంటే వాడు నిజంగానే దాని కొడుకని పిస్తోందిరా. పెళ్ళికి ముందు కాలుజారి ఉంటుంది. తన కింక పిల్లలు పుట్టే అవకాశంలేదు. ఉన్నవాళ్లిద్దరూ ఆడ పిల్లలు. ఈ ఆస్తి తన కొడుకే ఎందుకు అనుభవించ కూడదు—అనుకొని అది ఏదో పథకంవేసి నిన్ను బోల్తా కొట్టించి తన కొడుకునింటికి రప్పించుకుని నీ ఎదురుగానే వాడికి తల్లిప్రేమను అందిస్తోంది—" అందామె.

గోవిందరావు ఆమె మాటలు నమ్మడానికిష్టపడడం

లేదు.

"నా మాటలు నమ్మరు. ఏదో రోజున అది నిన్ను కూడా విషంపెట్టి చంపేస్తుంది—" అంది గోవిందరావు అక్క.

"శాంత అలాంటిది కాదు...." అన్నాడు గోవింద రావు.

"పెళ్ళాం మాటలు విని మరీ ఇంత చచ్చు వెధవ్వై పోయావేంటిరా!" అని విసుక్కుందామె.

ఈ సంభాషణ శాంతాదేవికి వినబడింది. అసలు విన పడాలనే గోవిందరావు అక్క కాస్త గట్టిగా మాట్లా డింది.

"పెళ్ళికిముందే పరాయి మగాడికి వళ్ళప్పగించి బిడ్డను కన్న ఆడది— పెళ్ళయ్యాక—అందులోనూ బిడ్డలు పుట్ట కుండా ఆపరేషన్ కూడా జరిగాక తిన్నగా ఉంటుం దటరా—"

శాంతాదేవికి వళ్ళంతా సూదులతో గుచ్చినంత బాధ కలిగింది. వదినగారి సంగతి ఆమెకి తెలియనిదేమీ లేదు. కానీ ఆవిడ అభియోగాలన్నీ భర్త సహించి ఎలా విం టున్నాడు? ఆయన మనసులో విషబీజం ప్రవేశించిందా.

శాంతాదేవి చటుక్కున ఆ గదిలోకి ప్రవేశించి—

"ఏమమ్మా వదినా—ముగ్గురు పిల్లల తర్వాత నువ్వు ఆప రేషన్ చేయించుకున్నావు గదా—ఆ అనుభవంతోనే ఈ మాటలంటున్నావా?" అంది.

గోవిందరావు అక్క తెల్లబోయింది. గోవిందరావు మాత్రం తీవ్రంగా—"శాంతా—పెద్దాచిన్నా లేకుండా ఏమిటామాటలు?" అన్నాడు.

"వయసుతోనే పెద్దవాళ్ళు కారండీ మనుషులు...."

అంది శాంతాదేవి.

"ఆ సంగతి నాకు తెలుసు. బుద్ధినిబట్టే పెద్దరికం! నీ బుద్ధెలాంటిదో ఇంట్లో ఏడేళ్ళ కుర్రాడు సాక్ష్యమిస్తున్నాడు—" అంది గోవిందరావు అక్క.

"నా బుద్ధెలాంటిదో నా మొగుడికి తెలుసు. మిగతా వాళ్ళేలా అనుకున్నా నాకు బాధలేదు...." అంది శాంతాదేవి.

"తెలుస్తూనే ఉంది నువ్వు సిగ్గులేనిదానివని. వాణ్ణి చవటనిచేసి ఆడిస్తున్నావు. నీ పరిస్థితుల్లో నేనుంటేనా-మొగుడు క్షమించినాసరే విషం మింగి చచ్చేదాన్ని...." అంది గోవిందరావు అక్క.

"ఇంతకీ మీ బాధ నేను చావలేదనా?" అంది శాంతాదేవి.

"శాంతా—ఊరుకో—" అన్నాడు గోవిందరావు.

"ఊరుకుంటానండీ! అన్నీ మీకు తెలుసు. మీరూరుకుంటున్నారు. నన్నూరుకోమంటున్నారు. ఇలాగే ఊరుకుంటే ఇప్పటికే నల్గురూ నమ్ముతున్న ఈ అబద్ధం ఇంకా ఇంకా బలపడిపోతుంది. మనవాళ్ళన్న వాళ్ళే మనల్నర్థం చేసుకోవాలి. పెళ్ళయి ఆరేళ్ళు దాటింది. ఇంకా ఈవిడ మిమ్మల్నీ, నన్నూ వేరుచేసి మాట్లాడుతుందేమిటి? మనమంతా ఓ కుటుంబంలోని వాళ్ళం కదూ—చేతనైన సాయంచేయాలి కానీ ఇదా మాట్లాడే పద్ధతి!" అంది శాంతాదేవి ఉక్రోషంగా.

"అంతా నా కర్మ!" అని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు గోవిందరావు.

"ఏదో తమ్ముడన్న అభిమానంకొద్దీ నాకు తోచింది చెప్పానుకానీ నీమీద నాకు ద్వేషమేమీ లేదు. మీ

సంసారం—మీ ఇష్టమొచ్చినట్లు పడండి—" అంది గోవిందరావు అక్క.

మర్నాడావిడ వెళ్ళిపోయింది.

"ఇక ముందునించి మన జీవితం ఇలాగే వుంటుంది. నాకు నీ మీద పూర్తి సానుభూతి ఉంది. నన్ను మాత్రం అపార్థం చేసుకోకు—" అన్నాడు గోవిందరావు భార్యతో.

అప్పటికే శాంతాదేవి ఒక నిర్ణయానికొచ్చింది.

7

రమ గుక్కపట్టి ఏడుస్తూంటే గోవిందరావుకు మెలకువచ్చింది! పక్కలో శాంతాదేవి లేదు.

"శాంతా, శాంతా!" అని పిలిచాడతను. జవాబు రాలేదు.

బహుశా బాత్రూంకు వెళ్ళి ఉంటుందని అనుకున్నాడు గోవిందరావు. అతడు రమను సముదాయించడానికి యత్నిస్తూండగా విజయ్ అక్కడికి వచ్చాడు.

"ఏరా—ఇలా వచ్చావ్?" అన్నాడు గోవిందరావు చిరాగ్గా.

"బాత్రూంకు వెళ్ళాల్సి లేచాను. రమ ఏడుపు వినిపించింది—" అన్నాడు విజయ్.

"బాత్రూంనుంచి వస్తున్నావా—అమ్మ బాత్రూంలో లేదా?" అన్నాడు గోవిందరావు.

"లేదు...."

ఉలిక్కిపడి లేచాడు గోవిందరావు. వెతికి చూడగా శాంతాదేవి ఇంట్లో ఎక్కడా లేదు. ఆ ప్రయత్నంలోనే అతనికి తలగడకింద ఓ ఉత్తరం కనబడింది. అది చూడ

గానే అతని మనసు కీడును శంకించింది. వణుకుతున్న చేతులతో దాన్ని చదివాడతను.

"ఏమండీ!

నేను దూరంగా వెళ్ళిపోతున్నాను. నా శవం కూడా మీ కళ్ళబడదు. నా పిల్లల్ని ఏ లోటూ లేకుండా పెంచి పెద్ద చేస్తారని ఆశిస్తున్నాను. ప్రస్తుత పరిస్థితిల్లో ఇంతకుమించి వేరే మార్గం కనబడ్డంలేదు నాకు. విజయ్ గురించి మీరేమని చెప్పగలరు!.... ఇప్పుడైతే నామీద ప్రేమతో వాణ్ని భరించానని చెప్పుకోవచ్చు.

సుఖంగా గడిచిపోతున్న మన కాపురంలో దేవుడే ఈ చిచ్చుపెట్టాడు. మీ క్షేమాన్ని, మన పిల్లల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చావాలనే నిర్ణయానికి వచ్చాను. పిల్లలకు మాత్రం నిజం చెప్పకండి. ఊరెళ్ళిందనీ మళ్ళీ వస్తుందనీ చెప్పండి. అవసరమనిపిస్తే రెండో పెళ్ళిచేసుకోండి. అందుకు ఈ ఉత్తరం ఉపయోగించుకోండి.

శాశ్వతంగా మీకు దూరమైపోతున్న—

మీ

శాంత."

ఉత్తరం చదివి కాసేపు అలా నిశ్చేష్టుడై ఉండిపోయాడు గోవిందరావు.

ఆఖరికి శాంత ఎంతపని చేసింది?

అసలు శాంత ఇలా ఎందుకు ప్రవర్తించింది?

రకరకాల ప్రశ్నలు గోవిందరావును బాధించాయి. అయితే తన ప్రవర్తన కూడా శాంతను కొంతవరకు ఆత్మహత్యపట్ల ప్రోత్సహించినట్లు అతడికి అనిపించింది.

కానీ తను ఏం చేస్తాడు? శాంతను తనేమీ పల్లెత్తుమాట అనలేదు. చుట్టూ వున్న సమాజాన్ని అదుపులో పెట్టడం తనవల్ల కాలేదు.

కానీ ఆడదాని బ్రతుకు చుట్టూ వున్న సమాజంపైనే ఆధారపడివుంది—ఆ సమాజం ఆమెను వెక్కిరిస్తున్నప్పుడు భర్త ఆమెను ప్రత్యేక శ్రద్ధతో చూడాలి. తనలా చూడలేదు. కానీ తనున్న పరిస్థితు లెలాంటివి?

విచిత్రమైన పరిస్థితులు శాంతను ఆత్మహత్యకు పురిగొల్పాయి.

ఇప్పుడు తనేం చేయాలి? శాంతను రక్షించుకునే అవకాశమింకా ఉందా?

గోవిందరావు బుర్ర హఠాత్తుగా పనిచేయడం ప్రారంభించింది. ఇప్పుడు టైము అయిదయింది. శాంత ఇల్లువదిలిపెట్టి ఎంతసేపయిందో? ఎంతయినా రెండు మూడు గంటలు దాటి ఉండదు.

పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే?

అప్పుడీ ఉత్తరం చూపించాలి. పోలీసులు మొత్తం కథ అడుగుతారు. వాళ్ళకు నిజంచెప్పక తప్పదు. విజయ్ తన కొడుకుకాదన్న విషయం ఊరంతా తెలుస్తుంది. కానీ అందువల్ల ఉమ, రమలకు ప్రమాదం. శాంత కోరిక అదికాదు. వాళ్ళ క్షేమాన్ని కోరే శాంత ఆత్మత్యాగానికి తలపడింది.

ఈ ఉత్తరం సంగతి తనకు తప్ప మరెవ్వరికీ తెలియదు. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచడమే మంచిది. ఎవరైనా అడిగితే పుట్టింటికి వెళ్ళిందని చెప్పవచ్చు. ఎటొచ్చీ పుట్టింటివాళ్ళు అడిగితే?

"పుట్టింటికని బయల్దేరింది. అంతకుమించి నాకేమీ తెలియదు...." అని చెప్పాలి.

8

"మిస్టర్ గోవిందరావ్! విజయ్‌ని నువ్వు ఈ రోజు సాయంత్రం అయిదు గంటలకు కొట్టావు. నా ఆఖరు హెచ్చరిక కూడా అయిపోయింది కాబట్టి నీ ఉమ, రమ ఏమవుతారో చూసుకో—"

గోవిందరావు కంగారుగా—"అబద్ధం. ఆ సమయంలో నేనింట్లో లేను. ఇంటికి నేను ఆరింటికి వచ్చాను—" అన్నాడు.

"నీ సంజాయిషీలు నేను వినను. నీ మాటలు నేను నమ్మను. ఈ రోజు రాత్రి నీ రమకు ఏం గతిపడుతుందో చూసుకో—"

"ఎవర్నువ్వు? ఎక్కణ్నించి మాట్లాడుతున్నావు?" అన్నాడు గోవిందరావు.

"ఆ వివరాలు నీకు అనవసరం. హెచ్చరిక అయిపోయింది!"

ఫోన్ క్లిక్కుమంది. గోవిందరావు మతిలేనివాడిలా వెర్రి చూపులు చూశాడు. తర్వాత నెమ్మదిగా రిసీవర్ క్రెడిల్ చేసి—"విజయ్!" అని పిలిచాడు.

"ఏం డాడీ!" అంటూ పరుగెత్తుకు వచ్చాడు విజయ్.

"ఈ రోజు సాయంత్రం అయిదుగంటలకు నిన్నెవరైనా కొట్టారా?"

"లేదు డాడీ! ఆయా రమను ఆడిస్తూంటే—నేను, ఉమ ఆడుకుంటున్నాం—"

గోవిందరావు విజయ్‌ను మరికొన్ని ప్రశ్నలు వేశాడు కానీ ఉపయోగించే సమాచారమేదీ రాలేదు.

ఫోన్ చేసిన వ్యక్తి ఎవరు? అతడికి తప్పుడు సమాచారాన్నెవరిచ్చారు? దానినతడెలా నమ్మాడు? అతడికి విజయ్‌మీద ఆసక్తి ఏమిటి?

గోవిందరావు కాసేపు ఆలోచించి—"ఏం లాభం లేదు—శివప్రసాద్‌కి ఫోన్ చేయాలి—" అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా అతడి వేళ్ళు చక-చకా పని చేశాయి.

"హాలో శివప్రసాద్ స్పీకింగ్—" అంది అవతలి కంఠం.

"శివప్రసాద్—నువ్వేనా? నేను....గోవిందరావుని మాట్లాడుతున్నాను...." అన్నాడు గోవిందరావు.

"సార్—ఏమిటి విశేషాలు!" అందా కంఠం వినయంగా.

"నీవల్ల నాకో సాయం కావాలి!"

"చెప్పండి సార్!"

"కొద్ది నిముషాల క్రితం నాకో ఫోన్ కాల్ వచ్చింది. సాయంత్రం అయిదింటికి కొట్టానుట. నా కూతురు రమను ఏదో చేస్తానని బెదిరిస్తూ మాట్లాడాడో వ్యక్తి!"

శివప్రసాద్ ఆశ్చర్యపడ్డట్టున్నాడు. అదంతా కంఠంలో ధ్వనించింది—"చాలా చిత్రంగా వుందిసార్! అలా ఎందుకు జరిగిందో!"

"ఎందుకో ఒకందుకు జరిగింది. ఈ విషయంలో నువ్వు చెయ్యగలిగింది చేయి—"

"సార్—ఇంటిదగ్గర సాయానికి మనుషుల్ని పంపించమంటారా?"

"ఇద్దర్ని పంపించు. నాకు భయంగా ఉంది!" అన్నాడు గోవిందరావు. తర్వాత అతను ఫోన్ పెట్టేసి

"ఆయా!" అని పిలిచాడు.

అతని పిలుపు వింటూనే ఆయా అక్కడకు వచ్చింది రమను ఎత్తుకుని. గోవిందరావు రెండు చేతులూ చాపగానే రమ అతడిమీదకు దూకేసింది. అతను పాపను హృదయానికి హత్తుకుని ముఖాన్ని ముద్దులతో నింపేసి ఆయావంక కృతజ్ఞతాపూర్వకంగా చూసి—"అత్యవసర పరిస్థితిలో దీని తల్లి పుట్టింటికి వెళ్ళింది. నువ్వు మూడు రోజుల్లో దీనిని చక్కగా మచ్చిక చేసుకున్నావు. నువ్వు ఇలాగే ఈ పాపకు తల్లిని మరిపించాలి. నీ ఋణం ఉంచుకోను—" అన్నాడు.

"ఇందులో ఋణానిదేముందండీ—ఇది నా వృత్తి. డబ్బు తీసుకు చేస్తున్న పనిని మీరు మెచ్చుకోవడం మీ సహృదయత. కలకాలం ఈ పాపను నేను చూడక్కర్లేదుగా. కన్న బిడ్డను విడిచి వాళ్ళమ్మ మాత్రం ఎన్నాళ్ళుండగలదు? కొద్ది రోజుల్లో ఎలాగూ వచ్చేస్తుంది—" అంది ఆయా. ఆమె చేతులు చాపగానే రమ ఆమె మీదకు దూకింది. కానీ రమ ఆయా దగ్గర ఉండలేదు. వచ్చీరాని ధ్వనులతో తండ్రిని మళ్ళీ చేయి చాపమని కోరింది.

అలా ఇద్దరిమీదకూ దూకుతూ కాసేపు ఆడుకుంది రమ.

"ఈ రోజు దాన్ని జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండు...." అన్నాడు గోవిందరావు.

"నేనీ ఇంట్లో ఉన్నన్నాళ్ళూ రమను కన్నతల్లికంటె ఎక్కువగా చూసుకుంటాను—" అంది ఆయా.

గోవిందరావు ఓ పర్యాయం కళ్ళు తుడుచుకున్నాడు. బహుశా అతడికి శాంతాదేవి గుర్తుకు వచ్చినట్లుంది.

ఆయా రమను తీసుకుని వెళ్ళిపోయింది.

తర్వాతేం చేయాలా అని ఆలోచిస్తూ ఉండిపోయాడు గోవిందరావు. అతడింకా ఆలోచనల్లో ఉండగానే ఆ ఇంటికి ఇద్దరు మనుషులు వచ్చారు. ఇద్దరూ కండలు తిరిగిన వస్తాదుల్లా ఉన్నారు.

"మమ్మల్ని శివప్రసాద్ పంపాడు—" అన్నారు వాళ్ళు.

గోవిందరావు వాళ్ళను చూసి తృప్తిగా నిట్టూర్చాడు. తర్వాత ఆయా ఉన్న గదిని వారికి చూపించి—"ఆయా చేతుల్లో ఉన్న నా పాపను మీరు ఈ రాత్రంతా కనిపెట్టి ఉండాలి. జాగ్రత్తగా ఉన్నందుకు ఎంత పారితోషికమో—అజాగ్రత్తగా ఉన్నందుకు అంత శిక్ష!" అన్నాడు.

"ఒక పనికి అంగీకరించాక పారితోషికం తీసుకోవడం మాత్రమే అలవాటు మాకు!" అన్నాడు వస్తాదుల్లో ఒకడు.

9

రాత్రి రెండుగంటలకు గోవిందరావు ఇంట్లో కాలింగ్ బెల్ మ్రోగింది. గోవిందరావు కంగారుగా లేచాడు.

వచ్చినదెవరై ఉంటారు? బెదిరించిన మనిషి వచ్చాడా?

వస్తాదు తలుపుతీయడానికి వెడుతూంటే గోవిందరావు ఆగమన్నాడు. ఆగంతకుడు వస్తాదుని పడగొడితే తను ఒంటరిగా మిగిలిపోతాడు. తనే వెళ్ళి తలుపుతీస్తే తన కేమైనా ప్రమాదం జరిగితే ఆగంతకుణ్ని వస్తాదు జాగ్రత్తగా ఎదుర్కొంటాడు.

ఆయా ఉన్న గదికి ఎటాచ్డ్ బాత్రూం ఉంది. బయటి నుంచి బాత్రూంలోకి ఏ వెంటిలేటర్ ద్వారానో ఆగం

తకుడు వచ్చే అవకాశముంటుందని భయపడి గోవిందరావు రెండో వస్తాదుని బయట కాపలా పెట్టాడు.

వస్తాదుకి ఏం చేయాలో చెప్పి గోవిందరావు గుమ్మం దగ్గరకు నడిచాడు. గోవిందరావు సూచన ప్రకారం వస్తాదు టెలిఫోన్ దగ్గరకు నడిచాడు.

గోవిందరావు వణుకుతున్న చేతులతో తలుపుతీశాడు. ఎదురుగా ఓ అపరిచితుడున్నాడు. అతడి ముఖానికి ఉన్న గెడ్డం, మీసాలు అతడెవరో తెలుసుకునేందుకు వీల్లేకుండా వున్నాయి.

"హలో గోవిందరావూ—నన్ను గుర్తుపట్టావా?" అంటూ చేయి జాపాడతను.

అతనెవరో గుర్తులేకపోయినా గోవిందరావు అప్రయత్నంగా చేయి జాపాడు.

ఆ వ్యక్తి షేక్‌హాండ్ ఇస్తూంటే గోవిందరావు చేతికి ఏదో గుచ్చుకున్నట్లయింది—"మోసం!" అంటూ అరిచి ఉన్నవాడున్నట్లుగా కూలిపోయాడు గోవిందరావు.

అది చూసిన వస్తాదు వెంటనే టెలిఫోన్ ఎత్తబోయాడు. అతను రిసీవర్ తీసేలోగానే ఆగంతకుడి చేతిలో రివాల్వర్ మెరిసింది. క్షణంలోనే అది పేలింది. కానీ శబ్దంలేదు. వస్తాదు మాత్రం ఉన్నవాడున్నట్లుగా కూలిపోయాడు.

ఆగంతకుడు తిన్నగా ఆయా ఉన్న గదిలోకి వెళ్ళాడు. అక్కడే రమ ఆయా ఒకరినొకరు వాటేసుకుని నిద్రపోతున్నారు. ఆగంతకుడి చేయి ఆయా మెడమీదకు వెళ్ళింది. అతడి వేలికి కట్టివున్న చిన్నసూది ఆమె మెడకు గుచ్చుకుంది. ఆమె ఒకసారి సన్నగా మూలిగి కొద్దిగా కదిలి మెడ వాల్చేసింది.

ఆగంతకుడు రమను చేతిలోకి తీసుకున్నాడు. అతడు ఎత్తుకున్నాక కూడా ఆ పాపకు మెలకువ రాలేదు. ఆగంతకుడు పాపను ఎత్తుకొని వీధిలోకి నడిచాడు. అక్కడ ఉన్న కారులో ఎక్కాడు. పాపను బ్యాక్ సీట్లో పడుకోబెట్టాడు. తను ముందు సీట్లోకి వెళ్ళాడు. కారు కదిలింది....

10

బాత్రూం గోడ అవతల కాపలాకాస్తున్న వస్తాదుకు చిన్న కునుకు పట్టినట్లయింది. గోడకు జారగిలబడే అతడు నిద్రపోతున్నాడు. మధ్యలో మెలకువచ్చి ఉలిక్కిపడి లేచాడతను. కళ్ళు నలుముకుని కంగారుగా ఓసారి చుట్టూ చూసి తర్వాత పైకి చూశాడు.

బాత్రూం వెంటిలేటర్ అద్దాలు పగిలేవు.

అతడు "హమ్మయ్య" అనుకుని నిట్టూర్చి—మత్తు వదలడం కోసం ఓసారి ఇల్లు చుట్టిరావాలనుకున్నాడు.

అలా తిరుగుతూ ఓసారి ఇంట్లోకి వెళ్ళి రెండో వస్తాదుని పలకరించాలనుకున్నాడతను.

వీధి తలుపులు జేరగిలవేసి ఉండడం గమనించి ఆశ్చర్యపడి చటుక్కున తీసి ఇంట్లోకి వెళ్ళాడు. గుమ్మానికి దగ్గర్లోనే ఉన్న గోవిందరావు కనబడ్డాడు.

వస్తాదు ఉలిక్కిపడ్డాడు. కంగారుగా ఇంట్లో తిరగడంలో టెలిఫోన్ దగ్గర పడివున్న తన వస్తాదు మిత్రుడు కనబడ్డాడు.

వస్తాదు అతణ్ని కదిపి చూశాడు. వంటిమీద ఎక్కడా గాయం కనబడలేదు. మనిషికి ఊపిరి ఆడుతోంది. వస్తాదు అతణ్ని గట్టిగా కుదిపాడు. కొద్దినిమిషాలలా చేసేసరికి పడిపోయిన వస్తాదు లేచి నిలబడి—"ఏం

జరిగింది— నేనెక్కడున్నాను?" అన్నాడు.

ఇద్దరు వస్తాదులూ ఒకరి సంగతి ఒకరికి చెప్పు కున్నారు.

"మనకు శిక్ష తప్పదు!" అన్నాడు ఓ వస్తాదు.

"మాట్లాడకుండా ఇక్కణ్ణించి వెళ్ళిపోతే?"

"మన బాధ్యత ఆ పాపను కాపాడ్డం? పద.... అక్కడి పరిస్థితి చూద్దాం...."

రమ అక్కడ లేకపోవడం వారు గుర్తించడానికి ఎంతోసేపు పట్టలేదు.

"ఏం చేస్తాం? ఆగంతకుడు మనల్ని మించినవాడు. ముందు గోవిందరావుగారి పరిస్థితి చూద్దాం."

ఇద్దరూ వెళ్ళి గోవిందరావును కదిపి, కుదిపి మెలకువ తెప్పించి జరిగింది చెప్పారు.

గోవిందరావుకు మళ్ళీ స్పృహతప్పినంత పనైంది.

"మీరేం చేస్తున్నారు?" అన్నాడతను కోపంగా.

"జీవితంలో మొదటిసారి ఓడిపోయాం—" అన్నాడు వస్తాదు నీరసంగా.

"నా రమ....రమ ఎలా ఉంది? క్షేమమేనా?" అన్నాడు గోవిందరావు వణుకుతున్న కంఠంతో.

ఆమె క్షేమంగా ఉంటుందన్న నమ్మకముంటే గోవిందరావు కంఠం వణికి ఉండేది కాదు.

11

"గోవిందరావ్! నా హెచ్చరికను నువ్వు లక్ష్య పెట్టడంలేదు. ఈ రాత్రి వచ్చి ఉమను కూడా తీసుకు పోతాను."

"వద్దు. నీకేం కావాలో చెప్పు...." అన్నాడు గోవిందరావు కోపంగా.

"నా మాట నువ్వు విననప్పుడు నీ మాట నేనెందుకు వినాలి?"

"నువ్వెవరో నాకు తెలియదు. నీకు అనుమానంగా ఉంటే విజయ్‌నే వచ్చి అడిగి తెలుసుకో. వాడు నా పిల్లలతో కలిసిమెలిసి ఆడుకుంటున్నాడు. వాడిమీద నాకేమీ పగలేదు. అసలే తల్లి దగ్గరలేక నా పిల్లలు బెంగటిల్లి ఉన్నారు. వాళ్ళను నువ్వు బాధించవద్దు—"

"నీ పిల్లలు నీకెంత ప్రాణమో—నాపిల్లాడు నాకూ అంతేకదా! ఈ రోజు ఉమను తీసుకువెళ్ళక తప్పదు—" అంది అవతల కంఠం.

"తీసుకెళ్ళి ఏంచేస్తావ్?"

"నువ్వు విజయ్‌ని హింసించడానికి రెట్టింపు హింసించి నీపై పగతీర్చుకుంటాను—"

"నేను విజయ్‌ని కంటికి రెప్పలా చూసుకుంటున్నానంటే నమ్మవేం?"

"కట్టుకున్న పెళ్ళానికే నిజంచెప్పని నీ చరిత్ర నాకు పూర్తిగా తెలుసు. నీమాటలెందుకు నమ్ముతాను?" అవతల క్లిక్‌మంది.

గోవిందరావుకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. అతను పరుగున కూతురు దగ్గరకు వెళ్ళాడు. విజయ్, ఉమ, ఏదో ఆడుకుంటున్నారు. గోవిందరావు కూతుర్ని ఎత్తుకుని— "ఓ మావయ్యగారింటికి వెడదాం, వస్తావా?" అని అడిగాడు.

"నేనూ వస్తాను—" అన్నాడు విజయ్.

గోవిందరావుకు విజయ్‌ని తన పరిచయస్తుల ఇంటికి తీసుకు వెళ్ళడం ఇష్టంలేదు. అందుకని—"నువ్వు వద్దు. ఇంట్లోనే ఉండు—" అని చెప్పి కార్లో బయల్దేరి తనకు

బాగా తెలిసిన పోలీస్ ఇనస్పెక్టర్ చంద్రశేఖర్రావు ఇంటికి వెళ్ళాడు.

"ఏమిటి విశేషాలు?" అనడిగాడు చంద్రశేఖర్రావు.

"నీకు తెలియని వేమున్నాయ్?" అన్నాడు గోవింద రావు నీరసంగా.

ఉమ పుట్టినరోజుకు ఆహ్వానం అందినా ఏవో పను లుండడంవల్ల చంద్రశేఖరరావు వెళ్ళలేకపోయాడు. అతడి భార్య మాత్రం వెళ్ళి విశేషాలు భర్తకు అంద జేసింది. వెంటనే అతడు ఫోన్ చేసి గోవిందరావును సంగ తేమిటని అడిగాడు. ఈ విషయంలో తనేమైనా సాయ పడగలనా అని కూడా అడిగాడు.

"ఎవరూ సాయపడలేరు. అంతా నా దురదృష్టం!" అన్నాడు గోవిందరావు అప్పుడు.

"నాకు తెలిసినదేముంది? నువ్వేదో దాస్తున్నావ్—" అన్నాడు చంద్రశేఖరరావు.

"అన్నీ తర్వాత చెబుతాను. నాకు తెలియని వ్యక్తి ఎవరో ఉమను తీసుకుపోతానని బెదిరిస్తున్నాడు. నాకేదో భయంగా ఉంది. ఈ రోజుకు దీన్ని నీ రక్ష ణలో ఉంచుతున్నాను. ఇంట్లో వుంచినా పోలీస్ స్టేష న్‌లో వుంచినా దీని రక్షణభారం నీదే!" అన్నాడు గోవిందరావు.

"అసలేమిటి కథ—" అన్నాడు చంద్రశేఖరరావు.

"ఇప్పుడు అర్జంటు పనిమీద వెడుతున్నాను. మళ్ళీ వస్తాను. అప్పుడు అన్నీ చెబుతాను...." అంటూ హడా వుడిగా అక్కణ్ణించి బయల్దేరాడు గోవిందరావు. అతడి మనసుపడే ఆరాటాన్ని సూచిస్తూ కారు చాలా

స్పీడుగా నడిచింది. అది శివప్రసాద్ ఇల్లు చేరడానికి ఎంతోసేపు పట్టలేదు.

12

శివప్రసాద్ గోవిందరావుని సాదరంగా ఆహ్వానించాడు.

"ఎక్కడో ఏదో మోసం జరిగింది!" అన్నాడు గోవిందరావు.

"ఏమైంది?"

"రాత్రి రమ మాయమైంది. డేర్ డెవిల్ కిడ్నాపింగ్—" అన్నాడు గోవిందరావు. అతడి కంఠం విన్నా ముఖం చూసినా ఏడ్వడానికి సిద్ధంగా ఉన్నాడని పిస్తోంది.

శివప్రసాద్ చాలా ఆశ్చర్యపడ్డాడు—"మరి నేను పంపిన వస్తాదులేమైనారు?"

"సారీ చెప్పి వెళ్ళిపోయారు!"

శివప్రసాద్ ఆలోచనలో పడ్డాడు.

గోవిందరావు తీవ్రంగా శివప్రసాద్ వంక చూసి—"నాకు నా రమ కావాలి!" అన్నాడు.

"నా శాయకతులా ప్రయత్నిస్తాను సార్!" అన్నాడు శివప్రసాద్.

"ప్రయత్నించడం కాదు. నాటకాలు కట్టిపెట్టు. రమ లేనిదే నేను బ్రతకలేను. నా చిట్టితల్లి నాక్కావాలి. నువ్వే దాన్ని మాయం చేశావని నాకు తెలుసు."

"సార్!" అన్నాడు శివప్రసాద్ కంగారుగా.

"నీకు తప్ప ఇంకెవరికీ ఆ అవకాశంలేదు. అవసరమూ లేదు...."

"ఆఖరికి మీరు నన్ను అనుమానిస్తున్నారా?" అన్నాడు శివప్రసాద్ దీనంగా.

"బాగా ఆలోచించి ఎవర్ననుమానించాలో నువ్వే చెప్పు!" అన్నాడు గోవిందరావు.

"అవకాశం నాకున్నమాట నిజమే! కానీ అవసరం... నాకేమిటి?"

"అవసరం లేకేం? ఉమ, రమ లేకుంటే విజయ్ ఒక్కడే నాకు మిగుల్తాడు...." అన్నాడు గోవిందరావు.

"పిల్లలంటే మీకున్న సెంటిమెంటు బాగా తెలిసిన వాణ్ని. వాళ్ళ జోలికి నేనెందుకు వెడతాను సార్! అసలుకే మోసం తెచ్చుకునేంత తెలివితక్కువవాణ్ని కాను నేను...." అన్నాడు శివప్రసాద్.

"నువ్వు కాకపోతే మరెవ్వరై ఉంటారు?" అన్నాడు గోవిందరావు.

శివప్రసాద్ ఆలోచనలో పడ్డాడు. ఈ కేసులో మూడో వ్యక్తి ప్రమేయం ఎలా వచ్చిందో అతడికి అంతు బట్టడంలేదు—"సార్! ఎలా ప్రవేశించాడో మన వ్యవహారంలోకి మూడో వ్యక్తి ప్రవేశించాడు. అతనెవరో అంతుబట్టడంలేదు నాకు...." అన్నాడతను.

"నేనే ఆ మూడో వ్యక్తిని...." అంటూ తలుపు చాటునుంచి ఓ వ్యక్తి ప్రవేశించాడక్కడికి.

ఇద్దరూ కంగారుగా లేచినిలబడ్డారు—"ఎవరున్నావ్?" అన్నాడు గోవిందరావు.

"నేనెవరో తర్వాత చెబుతాను. ముందు మీరు నేనడిగే ప్రశ్నలకు జవాబు చెప్పండి!" అన్నాడతను.

"చెప్పకపోతే?"

"మిస్టర్ గోవిందరావ్—చంద్రశేఖరరావు ఇంటికి

ఫోన్ చేసి ఉమ వుందో లేదో కనుక్కో. లేదని చెబుతారు. అప్పుడు నాతో మాట్లాడుదువుగాని..." అన్నాడావ్యక్తి.

గోవిందరావు కంగారుగా చంద్రశేఖరరావు ఇంటికి ఫోన్ చేసి కబురు విని కంగారుపడిపోయాడు చంద్రశేఖరరావు, గోవిందరావు వెనుకనే ఏదో పనిమీద బయల్దేరాట్ట. అతడలా వెళ్ళగానే ఓ వ్యక్తి మెరుపులా వచ్చి ఉమను తీసుకుని వెళ్ళిపోయాట్ట. చంద్రశేఖరరావు భార్య పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసిందట.

"ఎవర్నువ్వు?" అన్నాడు గోవిందరావు వణుకుతున్న కంఠంతో.

"చెబుతాను. కానీ ముందు నా ప్రశ్నలకు జవాబు కావాలి!"

"అడుగు...."

"విజయ్ ఎవరు?"

"నిజానిజాలు నాకు తెలియవు. శాంతకు వివాహం ముందు పుట్టిన బిడ్డ అని పదిమందిలోనూ ఉండగా ఒకడామెకు బిడ్డను అందించాడు. ఆమె ఆ మాటల్ని ఖండించలేదు—...." అన్నాడు గోవిందరావు.

"అలాగా—మరి విజయ్‌ని కొట్టడానికి వీల్లేదని నీకు బెదిరింపులెందుకొస్తున్నాయి?"

"ఏమో—తెలియదు...."

ఆ వ్యక్తి చేతిలో రివాల్వర్ మెరిసింది—"నేను మిమ్మల్ని చంపను. కానీ వికలాంగుల్ని చేస్తాను. ఇదేగతి కొన్ని క్షణాల తర్వాత నీ బిడ్డలకూ పడుతుంది. అసలు సంగతి ఏమాత్రం పొల్లుపోకుండా నాకు చెప్పాల్సిందే! నిజం నాకు తెలియదని అనుకోకండి. మీ నోట చెప్పించాలన్నదే నా తాపత్రయం...."

"ఏమిటి నీకు తెలిసిన ఆ నిజం?"

"ఉదాహరణకు విజయ్ శాంతకు పుట్టాడన్నావు.... అదీ పెళ్ళికిముందు. విజయ్ మీ పెళ్ళికి ముందు పుట్టిన మాట నిజమే....కానీ వాడు శాంత బిడ్డకాదు. నీ బిడ్డ అంటాను. నాకు తెలిసిన ఎన్నో నిజాల్లో ఇది మొదటిది!"

గోవిందరావు కంగారుపడ్డాడు. శివప్రసాద్ ముఖంలో అయితే భయమే మెలసింది. ఇద్దరూ ఏక కంఠంతో— "ఎవర్నువ్వు?" అన్నారు.

"ఇంకా సమయం రాలేదు. ముందు నే నడిగిందానికి చెప్పండి...."

గోవిందరావు కుర్చీలో కూలబడి శివప్రసాద్ వంక నిస్సహాయంగా చూశాడు. శివప్రసాద్ కథ చెప్పడానికే నిర్ణయించుకున్నాడు. అతను చెబుతూంటే ఆ వ్యక్తి వింటూ నిలబడ్డాడు.

శివప్రసాద్ అక్క పద్మినికీ, గోవిందరావుకీ పుట్టిన అక్రమ సంతానం విజయ్. పద్మినిని గోవిందరావు మోసం చేశాడు. తనజోలికి రాకుండావుంటే ఆమెకు పుట్టిన బిడ్డకు మంచి భవిష్యత్తుండేలా చేస్తాననీ, ఆమె పెళ్ళి ఖర్చులు తను భరిస్తాననీ అన్నాడు. పద్మిని తమ్ముడు శివప్రసాదుకు కాస్త గోవిందరావులాంటి వాళ్ళ అండ కావాలి. అన్నివిధాలా అంగీకరించి పద్మిని గోవిందరావు షరతులకు అంగీకరించింది. ఫలితంగా విజయ్ అనాథ శరణాలయంలో పెరిగాడు చాలా కాలం.

గోవిందరావుకు అనుభవించిన స్త్రీపై సెంటిమెం టున్నా లేకపోయినా తనకు పుట్టిన బిడ్డలంటే మాత్రం సెంటిమెంటు. విజయ్ అనాథ శరణాలయంలో పెరగడం అతడికి చాలా బాధగా వుంది. అందుగురించి అతడు

మథనపడసాగాడు.

"అందుకీ చెత్తపథకం ఎందుకు? ఓ ఆడదాన్ని మానసికంగా హింసించడమెందుకు? నీ భార్య శాంతాదేవికి విశాలహృదయముంది. నీ వెధవ చరిత్రను చెప్పుకుని ఏడిస్తే ఆమె నిండు హృదయంతో క్షమించి వుండేది కదా! ఆ బిడ్డను మనస్ఫూర్తిగా ఆదరించి చేరదీసేది కదా!" అన్నాడు ఆ వ్యక్తి.

తర్వాత కథ చెప్పడానికి శివప్రసాద్‌ని మళ్ళీ హెచ్చరించవలసి వచ్చింది. ఈ భాగాన్నతడు చాలా ఇబ్బందిపడుతూ చెప్పాడు. ఆ వ్యక్తి ఏ భావమూ లేకుండా వింటున్నాడు.

ముందు విజయ్‌ని ఇంట్లో అలా ప్రవేశపెట్టాలనే అనుకున్నారు. కానీ ఈలోగా గోవిందరావు కన్ను శివప్రసాద్ చెల్లెలు సుభద్రపై పడింది. అంతవరకూ వారి పథకం ఏమిటంటే—శాంతాదేవికింక ఎలాగూ పిల్లలు పుట్టారు కాబట్టి, వాళ్ళకెలాగూ మగపిల్లలు లేరు కాబట్టి నిజం చెప్పో, చెప్పకో విజయ్‌ని ఇంట్లో ప్రవేశపెట్టాలి. అయితే గోవిందరావు కన్ను సుభద్రమీద పడడంతో పథకం మార్చాల్సివచ్చింది.

సుభద్ర అపురూప సౌందర్యవతి మాత్రమే కాదు. పద్మినికంటే తెలివైనది. గోవిందరావుకు తన్ను వివాహం చేసుకునే ఉద్దేశ్యంలేదని ఆమె గ్రహించింది. గోవిందరావును వివాహం చేసుకోవడానికి ఆమెకు అభ్యంతరము లేదు. అందువల్ల ఆమె గోవిందరావు వలలో పడలేదు. అలాగని ఊరుకోకుండా ఒంటరి సమయాల్లో అతణ్ని రెచ్చగొట్టి ఊరించి అందకుండా పోతూవుండేది. క్రమంగా గోవిందరావుకు సుభద్రపై ఆకర్షణ పెరిగింది.

అతడామె వలలోపడ్డాడు. ఆమెను వివాహంచేసుకోవాలనుకునే స్థితికి వచ్చాడు. వారి వివాహానికి శాంతాదేవి మాత్రమే అడ్డు.

ఈ వివాహం శివప్రసాద్‌కీ ఆమోద యోగ్యమే అయింది. గోవిందరావువంటి ధనవంతుడితో తనకు సంబంధ బాంధవ్యాలు గట్టిపడతాయి. అక్కకొడుకు కాబట్టి విజయ్‌కి మంచి రక్షణ ఉంటుంది.

అప్పుడే ముగ్గురి బుర్రలూ పని చేశాయి. విజయ్‌ని ఇంట్లో ప్రవేశపెట్టడంతోనే శాంతాదేవికి మానసిక హింస ప్రారంభం కావాలి. ఆఖరికి ఆమె ఆత్మహత్యకు సిద్ధపడాలి.

విజయ్‌ని కొట్టడమూ, ఆ విషయమై టెలిఫోన్లు రావడమూ ముందుగా నిర్ణయించుకున్న పథకాలు. సమాజం, గోవిందరావు అక్కలాంటివారు తమకు తెలియకుండానే తమ సహజపద్ధతిలో ఈ పథకానికి సహకరించారు.

శాంతాదేవి ఆత్మహత్య చేసుకుంది.

కానీ విజయ్ గురించిన టెలిఫోన్లు ఆగలేదు.

ఎవరు చేస్తున్నారు? ఎందుకు చేస్తున్నారు?

"శాంతాదేవి మీ రనుకున్నంత తెలివితక్కువది కాదు. మనసు చెదిరి ఆమె పుట్టిలుచేరి తన దీన గాథ చెప్పుకుంది. ఆమె తమ్ముడు నా దగ్గరకువచ్చి ఈ కథంతా చెప్పాడు. చంటిపిల్లను వదిలి ఉండలేకపోతోందామె. ఆమె సమస్యంతా విన్నాక—నాకో ఉపాయం తోచింది. ఇంకా విజయ్ పేరుతో టెలిఫోన్స్ చేసి—ఈ పథకంలో ఎవరున్నారో వారిని కంగారుపెట్టవచ్చు. అలాగే కిడ్నాపింగ్ పేరుతో పిల్లల్నెత్తుకుపోయి తల్లి దగ్గరకు చేర్చవచ్చు...."

"శాంత బ్రతికేవుందా!" ఉత్సాహంగా అన్న గోవిందరావు ముఖం అంతలోనే పాలిపోయింది. తను ఇప్పుడు శాంత బ్రతికిఉంటే మాత్రం ఆమెకు తన ముఖాన్నెలా చూపించగలడు?

"నీ దురదృష్టంకొద్ది ఆమె ఇంకా బ్రతికే ఉంది. నీ అదృష్టమేమిటంటే ఇప్పుడు నీ కథంతా విని కూడా ఆమె నిన్ను క్షమించవచ్చు...." అని ఆ వ్యక్తి ఆగి— "గోవిందరావూ! పెళ్ళిచేసుకున్నవాడు పిల్లలొక్కర్నే ప్రేమిస్తే చాలదయ్యా—పెళ్ళాన్ని కూడా ప్రేమించాలి!" అన్నాడు.

గోవిందరావు ఏమీ మాట్లాడలేదు.

"ఇన్ని ఘోరాలు జరిగినా నువ్వు కిక్కురుమనక పోవడమూ, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడమూ నాకు నీమీద అనుమానాన్ని కలిగించాయి. నేను రంగంలోకి దిగగానే నువ్వు శివప్రసాద్ చుట్టూ తిరగడంతో కథంతా మీ ఇద్దరిమధ్యనే ఉన్నదనిపించింది. చేసిందేదో చేసావుగానీ—తక్షణం పరుగెత్తుకుని నీ భార్య దగ్గరకు వెళ్ళు. చంద్రశేఖరరావు సహకారంతో నీ కూతురు ఉమ కూడా ఈపాటికి ఆ ప్రయాణం దారిలో ఉంటుంది—" అన్నాడు ఆ వ్యక్తి.

"ఇంతకీ....నువ్వు....మీరు....మీరెవరు?" అన్నాడు గోవిందరావు.

"నన్ను డిటెక్టివ్ వెంకన్న అంటారు!" అని ఆ వ్యక్తి అక్కణ్ణించి చర-చరా వెళ్ళిపోయాడు. వెళ్ళేటప్పుడు అతని చేతిలోని మినీ టేప్ రికార్డర్‌ను గోవిందరావు, శివప్రసాద్ కూడా చూశారు.

—— :ఐపోయింది :——